క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఉష

సుల్తానాబాద్‌పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద చలివేంద్రాన్ని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ప్రారంభించారు. పట్టణ వాసులు, ప్రయాణికులు, ఆటోడ్రైవర్లు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. ఏర్పాటుకు సహకరించిన మూడోవార్డు కౌన్సిలర్ నిషాన్‌ఖాతున్, రఫీక్‌ను అభినందించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్‌పటేల్, మండల ఉపాధ్యక్షుడు నర్సయ్య, కార్యదర్శి కేదాసి రమేశ్ పాల్గొన్నారు. మార్కండేయ కాలనీలో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటుచేశారు.

బెస్ట్ టాలెంట్ అవార్డుకు ఇండియన్ ఎంపిక



గోదావరిఖనిటౌన్: గోదావరిఖని గంగానగర్‌కు చెందిన లింగంపల్లి రాజేశ్ దేశంమీద ప్రేమతో తన చిన్న కుమారుడికి ఇండియన్ అని పేరుపెట్టాడు. దీంతో ఈ బుడ్డోడికి అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 22న హైదరాబాద్ సారథి స్టూడియోస్‌లో జరిగే మా అసోసియేషన్ రుద్ర స్టూడియో సెకండ్ ఈవెంట్ ఆధ్వర్యంలో బెస్ట్ నేషనలిస్టు చైల్డ్‌లో ఇండియన్ పేరు నమోదైంది. ఇలా దేశం పేరు పెట్టుకోవడంపై పలువురు లింగంపల్లి రాజేశ్‌ను అభినందిస్తున్నారు.

జీజీహెచ్‌కు టీవీ బహూకరణ



టీవీని అందజేస్తున్న ప్రతినిధి

కోల్‌సిటీ: రామగుండం జీజీహెచ్ ఆస్పత్రికి గురువారం నగరపాలక సంస్థ సీనియర్ సివిల్ కాంట్రాక్టర్ జంగపల్లి విశ్వతేజ టీవీని బహూకరించారు. ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందిన బల్దియా సీనియర్ కాంట్రాక్టర్ గడ్డి కనకయ్య జ్ఞాపకార్థం టీవీని, ఆస్పత్రిలోని పిల్లల వార్డులో ఏర్పాటు చేసేందుకు అందించినట్లు విశ్వతేజ వెల్లడించారు. విశ్వతేజను ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ అభినందించారు. అన్వర్, సలీం పాల్గొన్నారు.

గాయత్రీ క్యాంపస్‌డ్రైవ్‌లో 117మందికి ఉద్యోగాలు



నియమక పత్రం అందిస్తున్న కంపెనీ సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్‌డ్రైవ్‌లో 117మంది ఉద్యోగాలు సాధించారని కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ప్రముఖ కంపెనీలు నిర్వహించిన ఈ డ్రైవ్‌లో 220 మంది పాల్గొన్నారు. చదువుతో పాటు ప్రతిభగల వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ రవీందర్, కుమార్, సమద్, రాజ్‌కుమార్, అనూష, ఖాదర్‌తో పాటు హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లాస్థాయి స్త్రీ, పురుషుల(సీనియర్స్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను సుల్తానాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాకార్యదర్శులు దాసరి హనుమయ్య, ఎండీ.అజ్జు తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌ఫొటోలతో ఈనెల 23న మధ్యాహ్నం 3గంటలకు సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా కొప్పుల జన్మదిన వేడుకలు

పెద్దపల్లిరూరల్/కమాన్‌పూర్/పాలకుర్తి/ఫెర్టిలైజర్‌సిటీ: రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం పర్మినెంట్ కార్మిక సంఘం, కన్నాల సింగిల్ విండో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఆవరణలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు.

మండల కార్యాలయాల నిర్మాణమెప్పుడో?

- ఏడేళ్లయినా... ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పెచ్చులూడుతున్న భవనం



శిథిలావస్థకు చేరిన పాలకుర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయ భవనం

పాలకుర్తి: పరిపాలన సౌలభ్యం కోసం 2016లో పాలకుర్తి మండలకేంద్రంగా ఏర్పాటై ఏడేళ్లయినా ఇప్పటివరకూ ప్రభుత్వ కార్యాలయాలకు సొంతభవనాలు లేవు. మండల కార్యాలయాలు ఒక్కొక్కటి ఒక్కో గ్రామంలో ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణంపై పాలకులు, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామానికో కార్యాలయం..

ప్రభుత్వ కార్యాలయాల కోసం మొదటగా బసంత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రతిపాదించినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధుల తీరుతో కార్యాలయాలు బసంత్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటుచేశారు. అయితే ఉమ్మడి పాలకుర్తి గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగిన బసంత్‌నగర్ ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు కావడంతో పాలకుర్తి గ్రామస్తులు తమ గ్రామంలోనే కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరడంతో పాలకుర్తి అనుబంధ గ్రామం బక్కరాజంపల్లిలోని ఓ పాత రైస్‌మిల్లులో తహసీల్దార్ కార్యాలయం, పాలకుర్తి పంచాయతీ కార్యాలయ భవనంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైపెచ్చులు ఊడిపడుతుండడంతో అధికారులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. మండల ఐకేపీభవనం, విద్యుత్ ట్రాన్స్‌కో కార్యాలయాలను ఇటీవల బసంత్‌నగర్ పాత పోలీస్ స్టేషన్ భవనంలోకి మార్చారు. ఎంఈవో కార్యాలయం బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేశారు. ఇలా ఒక్కో కార్యాలయం ఒక్కోగ్రామాల్లో ఏర్పాటుచేయడంతో సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో వివిధ పనుల కోసం ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఎవరికి వారే యమునా తీరే...

భవన నిర్మాణాలకు ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. బసంత్‌నగర్ శ్మశానవాటికకు సమీపంలో రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని గతంలో ప్రతిపాదించినప్పటికీ, అది కేశోరాం సిమెంట్ కర్మాగారం ఆధీనంలో ఉండడంతో సమస్యగా మారింది. మరోవైపు కార్యాలయాలను రాజీవ్‌రహదారికి ఆనుకుని నిర్మిస్తే బాగుంటుందని మెజార్టీ ప్రజలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. కార్యాలయాలు తమ గ్రామంలోనే కార్యాలయాలు ఏర్పాటు చేయాలని పాలకుర్తి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జీడీనగర్, కన్నాల జీపీపరిధిలో రాజీవ్‌రహదారిని ఆనుకుని ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ కార్యాలయాలు అక్కడ నిర్మిస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందని మెజార్టీ ప్రజలు అంటున్నారు. అయితే ఈ రెండు గ్రామాలు మంథని నియోజకవర్గం పరిధిలో ఉండడంతో ఎమ్మెల్యే చందర్ విముఖత చూపుతున్నారనే ప్రచారం ఉంది. నియోజకవర్గాలు వేరైనప్పటికీ ఆయా గ్రామాలు పాలకుర్తి మండలంలోనే ఉన్నందునా ఈవిషయంలో ఎమ్మెల్యే పునరాలోచించి అందరిని సమన్వయంతో ప్రజలకు, అధికారులకు సౌకర్యంగా ఉండే ప్రాంతంలో మండల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అందరికి సౌకర్యవంతంగా ఉండాలి



మండల కార్యాలయాలు అన్ని ఒక చోట లేకపోవడంతో సరైన రవాణా సౌకర్యం లేని కారణంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ముఖ్యంగా వృద్ధులు, సొంత వాహనాలు లేని వారి పరిస్థితి దయనీయంగా ఉంది. మండల కార్యాలయానికి రావాలంటే వాహనాలు ఎంగేజ్ చేసుకుని రావాల్సిన పరిస్థితి. కార్యాలయాన్నింటిని మండల ప్రజలందరికీ సౌకర్యవంతంగా ఉండే ప్రాంతంలో నిర్మించాలి.

– కట్కూరి వెంకటేశ్, కొత్తపల్లి

రాజీవ్ రహదారిని ఆనుకుని ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట నిర్మించాలి. మండల పరిధిలోని రాజీవ్‌రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలి. బసంత్‌నగర్ బస్టాండ్ నుంచి ధర్మారం క్రాస్‌రోడ్డు వరకు ఎక్కడ ఏర్పాటు చేసినా అటు అధికారులకు, ఇటు మండల ప్రజలకు అందరికీ అనుకూలంగా ఉంటుంది. పాలకులు ఆ దిశగా ఆలోచన చేయాలి.

– పుప్పాల దయానందం, కన్నాల

పిల్లలకు చదువుతోపాటు పౌష్టికాహారం ముఖ్యం



పౌష్టికాహారం అందిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

కోల్‌సిటీ: పిల్లలకు చదువుతోపాటు పౌష్టికాహారం చాలా అవసరమని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని కరీంనగర్ ఆశాజ్యోతి కేంద్రంలో గురువారం మంత్రి కొప్పుల ఈశ్వర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పౌష్టికాహారాన్ని సీఐ అందించారు. అంతకుముందు టీబీజీకేఎస్ ఆర్జీ–1 బ్రాంచ్ సెక్రటరీ రాదండి బాలయ్యను సీఐ అభినందించారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు సమ్మయ్య, గడ్డం శ్యాంకుమార్, బిక్షపతి, కృష్ణ, సదన్‌కుమార్, సాయికుమార్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ లిటిల్, సిబ్బంది జ్యోతి, లావణ్య, తిరుమల, శివరామకష్ణ పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



జూలపల్లి: విందులో పాల్గొన్న రఘువీర్ సింగ్



కానుకలు అందిస్తున్న కార్పొరేటర్ రమణారెడ్డి

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/జ్యోతినగర్/జూలపల్లి: ముస్లింల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి సుల్తానాబాద్ పద్మనాయక కల్యాణ మండపంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి రోడ్‌లోని ఈద్గాను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరిశీలించారు. బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని సాగర్‌రోడ్‌తో పాటు,మండలంలోని అప్పన్నపేటలో ముస్లింలకు నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. పెద్దపల్లి ప్రాంతంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాగా రూ.10లక్షలు విలువైన నిత్యావసర సరుకులను సురభి మెడికల్ యజమాన్యం పంపిణీ చేసింది. పెద్దపల్లి పట్టణానికి చెందిన సురభి రాంచందర్‌రావు, హరేందర్‌రావు, మహేందర్‌రావు, విఖ్యాత్‌రావు పెద్దపల్లిలో సరుకులు పంపిణీ చేశారు. జ్యోతినగర్‌లో ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీచేశారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలోని మజీద్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ కానుకలను కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి పంపిణీ చేశారు. జూలపల్లి మండలకేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ముస్లింలకు ప్రభుత్వం పంపిణీ చేసిన రంజాన్ ఇఫ్తార్ కానుకలను మండలాధ్యక్షురాలు కూసుకుంట్ల రమాదేవి అందించారు.

బీజేపీని బలోపేతం చేయండి

- కేంద్ర పశుసంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తం రూపాల



కేంద్రమంత్రిని సన్మానిస్తున్న రాజేందర్

పెద్దపల్లిరూరల్: గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కేంద్ర పశుసంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. పెద్దపల్లిలోని పార్టీ జిల్లా కార్యాలయానికి వచ్చిన మంత్రిని జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజేందర్, నాయకులు రాజేశ్వర్‌రావు తదితరులు సన్మానించారు. ముఖ్యనాయకులతో మాట్లాడారు. ప్రతీ కార్యకర్త పార్టీ పటిష్ఠతకు కృషిచేయాలన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు గ్రామస్థాయికి చేరుతున్నాయని, వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పార్టీ అధినాయకత్వం పార్టీ జిల్లా కార్యాలయాలకు సొంతభవనాలకు నిధులిస్తోందని, అద్దెభవనంలో పార్టీ కార్యాలయం ఉండటమేంటన్నారు.

నవజీవన్‌రైలును పెద్దపల్లిలో ఆపండి...

ఈ ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలును పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిపేలా చొరవ తీసుకోవాలని మార్వాడీ సేవాసమాజ్ నాయకులు శ్యాంసుందర్ అట్టల్, దిలీప్, రామ్ తదితరులు మంత్రిని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు.

ఉద్యోగవిరమణ పొందిన అధికారికి సన్మానం



సన్మానిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్: సింగరేణి సంస్థ ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో సివిల్(కార్పోరేట్) విధులు నిర్వహిస్తున్నా సీహెచ్. రమేశ్ ఈనెల 30న ఉద్యోగవిరమణ పొందనున్న నేపథ్యంలో గురువారం జీఎం కార్యాలయంలో రమేశ్‌ను జీఎం వెంకటేశ్వర్‌రావు అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు ఎలీశా, సీతారామం, శ్రీనివాస్‌లు, రాధాకృష్ణ, వెంకటరమణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలో మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుల పిల్లలకు గురువారం కారుణ్య నియామక పత్రాలు అందించారు. జీఎం కార్యాలయంలో నియామక పత్రాలను జీఎం ఎ.మనోహర్ అందించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, డీజీఎం ఐఈడీ మురళీ కృష్ణ, సీనియర్ పీవో వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత

మంథని: ముత్తారం మండలం ఖమ్మంపల్లి మానేరు మీదుగా నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. నాటుసారా తయారుచేసి చుట్టుపక్కల గ్రామాలకు బైక్‌పై సరఫరా చేస్తున్నారనే సమాచారంతో డీటీఎఫ్ సీఐ వినోద్ రాథోడ్ ఆధ్వర్యంలో ముత్తారం మండలం ఖమ్మంపల్లి మానేరు వద్ద తనిఖీలు చేసి ఆరు లీటర్ల నాటుసారాతో పాటు బైక్ స్వాధీనం చేసుకొని గంగుల రాజబాపుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం ముత్తారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి

ఓదెల/ఎలిగేడు/మంథని ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించిన బీఆర్ఎస్‌కు మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఓదెల మండలం కొమిర, బీమరిపల్లె గ్రామాల్లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ అఖండ విజయం సాధిస్తుందని, అధిక మెజార్టీతో మూడో సారి అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ ఎలిగేడు మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఎలిగేడు మండలంలోని లోకపేటలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్‌కమిటీ చైర్మన్

ధర్మారం: రాష్ట్రప్రభుత్వం కంటిసమస్యలు దూరం చేసేందుకు నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి కోరారు. ధర్మారం మండలం నర్సింగపూర్‌లో గురువారం కంటివెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ కంటివెలుగు పథకాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండ సత్యనారాయణరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ బద్దం లింగారెడ్డి, వైద్యాధికారి గౌతంకుమార్, హెచ్ఈవో రాజారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి



ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్

మంథని: పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ కోరారు. గురువారం మండలంలోని నాగెపల్లి కేంద్రాన్ని ప్రారంభించారు. భట్టుపల్లి కొనుగోలు కేంద్రాన్ని సంఘం ఉపాధ్యక్షుడు బెల్లం కొండప్రకాశ్‌రెడ్డి, వెంకటాపూర్‌లో డైరెక్టర్ పెద్దిరాజు ప్రభాకర్ ఆరెంద కేంద్రాన్ని సర్పంచ్ మాసిరెడ్డి శ్రీకళ ప్రారంభించారు. సంఘం డైరెక్టర్లు రావికంటి సతీశ్‌కుమార్, సిరిమూర్తి ఓదెలు, గడ్డం పోచం, సీఈఓ మామిడాల అశోక్‌కుమార్,సర్పంచ్‌లు గూడ సరోజన, దబ్బెట సరోజన ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమావేశం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట రైతువేదికలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణపై ఐకేపీ, సింగిల్‌విండో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, హామాలీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కావేరి మాట్లాడుతూ.. ధూళికట్టలో రెండు ఐకేపీల ద్వారా కేంద్రాలు, సింగిల్‌విండో ద్వారా ధాన్యం కొనులుగోలు కేంద్రం ఏర్పాటుచేశామని కేంద్రాల్లో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుసమన్వయ సమితి మండల అధ్యక్షుడు సుధాకర్‌రావు, మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేశ్, పంచాయతీ కార్యదర్శి, కేంద్రాల నిర్వాకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

గోదావరిఖనిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం 'మగువ' ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని ఎన్టీఆర్ నగర్‌లోని కాకతీయ టెక్నోస్కూల్‌లో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్ రేకుర్తి ఆస్పత్రి నిర్వాహకులు ఉచిత కంటిపరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం 20 మందిని ఆపరేషన్ కోసం రేకుర్తి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా మగువ అధ్యక్షురాలు సోమారపు లావణ్య మాట్లాడుతు.. లయన్స్ క్లబ్ ద్వారా అందిస్తున్న ఉచిత సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సోమారపు అరుణ్‌కుమార్, మగువ సెక్రటరీ డాక్టర్ లక్ష్మీవాణి, మగువ సభ్యులు మాతంగి రేణుక, గాలి సునీత, గాండ్ల స్వరూప, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

రాయదండిలో జిల్లా అధికారుల పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న జిల్లా అధికారుల బృందం

రామగుండం: స్వచ్ఛభారత్ గ్రామీణ్ ఫేజ్–2లో భాగంగా మూడు రోజుల శిక్షణ శిబిరం నిర్వహించారు. సామాజిక అంశాల అమలుపై గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ నేతృత్వంలో పంచాయతీరాజ్ అధికారుల బృందం క్షేత్ర పర్యటన చేశారు. ఈ మేరకు గురువారం అంతర్గాం మండల పరిధిలోని రాయదండిలో గ్రామసభకు హాజరై మాట్లాడారు. గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, ఇంకుడుగుంతలు, ఘన–ద్రవ వ్యర్థాలపై అవగాహన, ప్రతీ కుటుంబంలో టాయిలెట్స్ నిర్మాణం తదితర అంశాలపై సమగ్రంగా ఇంటింటా సర్వేచేపట్టారు. ప్రతీ ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండాలని, వాటినే వినియోగించాలని, బహిరంగ మలవిసర్జన చేయొద్దని, ప్రతీ ఇంటిలో ఇంకుడుగుంతలు తప్పనిసరిగా ఉండాలని, చెత్త వ్యర్థాలను తడి–పొడిగా విభజించి పారిశుధ్య కార్మికుడికి వేర్వేరుగా అందించాలని తదితర సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మాజి కృష్ణ, ఉప సర్పంచ్ పవన్‌కుమార్, జిల్లా ఏపీడీ సత్యనారాయణ, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రాఘవులు, రేణుక, సురేందర్, ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ మోతె సమ్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్నరాణి, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



జూలపల్లి: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరించక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకుడు అమరగాని ప్రదీప్‌కుమార్ అన్నారు. గురువారం పాఠశాలలో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని విద్యార్థులతో కలిసి పాఠశాల గేటు ఎదుటధర్నా నిర్వహించి మాట్లాడారు. రాజకీయాల కోసం అభివృద్ధిని అడ్డుకోవద్దన్నారు. వెంటనే భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మేరుగు కనుకయ్య, రాజు, మానుమండ్ల తిరుపతి, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫైర్ విన్యాసాలు!



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది



ఫైర్ సిబ్బంది చేస్తున్న ఫైర్ విన్యాసాలు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ ఆర్.సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్ చౌరస్తాలో ఫైర్‌స్టేషన్ సిబ్బంది చేసిన ఫైర్ విన్యాసాలు(వాటర్ డ్రిల్), మంటలను చల్లార్చే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 'అగ్ని ప్రమాదాలను అరికడుదాం.. జాతి సంపదను పెంపొందించుదాం.' అనే నినాదం ప్రాముఖ్యతను వివరిస్తూ స్థానికులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించే కపరత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ ఎ.రమేశ్, డ్రైవర్ ఆపరేటర్లు ఆర్.శ్రీకాంత్,ఎండీ.శౌకత్‌అలీ, ఫైర్ ఆపరేటర్స్ బి.శ్రీనివాస్, సీహెచ్.శ్రీనివాస్, బి.సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.